# "భక్తిప్రపూర్ణిత" : :

రచయిత :
శ్రీ ఆరిపాక సూరిబాబు

ఆంధ్రదేశంలో ప్రతీ పట్టణంలోనూ, పల్లెలలోనూ అధ్యాత్మిక ప్రభోధనలు చేస్తూ, నాడు సూరంపూడి గ్రామానికి విచ్చేసేరు శారదమ్మగారు. వీరిని ఆంధ్రదేశం అంతా "భక్తిప్రపూర్ణిత" అంటూ – అఖండమైన స్వాగతాలు, సన్మానాలు జరుపుతున్నారు. ఈనాడు శారదమ్మగారి సుభాషితాలు వినే అదృష్టం ఈ ఊరి వారికి లభించింది. అధ్యాత్మిక చింతనగల ప్రతీవారు ఈ అవకాశాన్ని పురస్కరించుకొని, అంతా "రామభజనకోవెల"కి చేరుకున్నారు. ప్రకాశంకి ఇలాంటివి ఇష్టంలేకపోయినా, తన విధవ అక్కగారి బలవంతాన వెళ్ళక తప్పలేదు!....

కోవెల ఆవరణ అంతా స్త్రీ;పురుష జనసందోహంతో నిండి పోయింది. శారదమ్మగారు మధ్యని సితార మీటుతూ రామనామ సంకీర్తనం పాడుతుంటే – శిష్యురాండ్రు తాళాలు వాయిస్తూ – శ్రుతి కలుపుతున్నారు.

ప్రకాశం ఒక మూలని కూర్చున్నాడు. అయిష్టతతోనే వింటున్నాడు. అయినా ఆ కంఠం ఇదివరకెప్పుడో. విన్నట్టనిపించిందతనికి! కళ్ళజోడు సంచె కొంగుతో బాగా తుడిచికొని - నిదానంగా శారదమ్మగారి వేపు దృష్టి నిల్పేడు. కాషాయవస్త్రాలు, తులసి - రుద్రాక్షర మాలలతో వున్న శారదమ్మగారు, తనకి పరిచయ వ్యక్తి లాగే కనిపించింది సారి!....ఎప్పుడు?....ఎక్కడ??... ఇలాంటి అధ్యాత్మికుల పరిచయాలుగాని, వాళ్ళ ప్రసంగాలుకాని తనకి నచ్చవు. ఇదివరకెప్పుడూ ఇలాంటి భజనలు, ప్రభోధనలకి వెళ్ళి ఎరుగడు. అలా ఆలోచిస్తూ జ్ఞాపకం చేసుకోడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు!

శారదమ్మగారు కీర్తన పాడుతుండగా, దూరానవున్న ప్రకాశం ఆమె కంటబడ్డాడు. ఒక్క క్షణం ఆశ్చర్య చకిత అయింది. సితార మీటుతున్న వ్రేళ్లెందుకో వణుకుతున్నాయి!

లైట్ల కాంతిలో శారదమ్మగారి ముఖకవళికలు. ప్రకాశం బాగా పరికించేడు. ఇప్పుడు ఆమె ఎవరో మనసులో మెదల సాగింది...

సుమారు 20 సం॥రాల క్రితం, 18 ఏళ్ళ, శ్యామలని - 50 ఏళ్ళ మహేశానికిచ్చి పెళ్లి చేసేరు. ఈ పెళ్ళి శ్యామలకి ఇష్టంలేకపోయినా. తల్లిదండ్రులమాట నిలబెట్టడం కోసం పెళ్ళి చేసుకోవలసి వచ్చింది.

మహేశం 'గొల్లపల్లి' గ్రామానికి పెద్ద ఆస్తిపరుడిగా - పదిమందిలో పలుకుబడి వ్యక్తిగా చలామణి అవుతున్నవాడు. పెద్ద ఇల్లు, సంవత్సరానికి సరిపోయే తిండి గింజలు వచ్చే పొలం వున్నాయి. పట్నం బ్యాంకులో 25 వేలదాకా రొఖ్ఖం వుంది. అతని మొదటి భార్య సంతతి ఇద్దరూ ఆడ పిల్లలే! వాళ్ళిద్దరికీ వైభవంగా పెళ్లిళ్లు జరిగిపోయాయి. మొదటి భార్య మరణంవల్ల మహేశం చాలా కృంగిపోయాడు. ఇంటిలో దక్షతలేదు. తన మనసులో మళ్లీ పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాడు ....చేసుకున్నాడు.

శ్యామలని, మహేశం అత్యంత అభిమానంగా చూసేవాడు. అభిమానమే కాకుండా ఎన్నో రాత్రులు శ్యామల పొందుతో ఆనందంగా గడిపేవాడు. భార్యకి ఏ విషయంలోనూ లోటురాకుండా వుండాలని అతని ఉద్దేశ్యం. అందుకు ఆమె కోరికలని అడిగేవాడు. 'నా కోరిక లేమీ లేవ'నేది; అదోరకంగా. నిజానికి శ్యామల అండగా సుఖజీవితం గడిపినట్లు తృప్తిపడలేదు. మహేశం దగ్గర తను కూతురులాగ ఉంటుందని, అతనికి తనయందు మక్కువ ఉన్నా - తనకి మాత్రం మహేశం అంటే అదో విధమైన అసహ్యం వేసేది. ఎదురింటి ప్రకాశరావు, శ్యామల మనసులో స్థానం ఆక్రమించుకున్నాడు. అతడంటే తరగని ప్రేమ! ....

ప్రకాశరావు మంచి జల్సా యువకుడు! పేరుకి పెళ్ళి కాలేదుకాని, అనుభవంలోమటుకు ఘటికుడే! అలాంటి వాడికి శ్యామల లభించబోతుందని ఎన్నడూ ప్రకాష్ అనుకోలేదు. తనపై విసురుతున్న మన్మధ రూపులకు ప్రకాష్ పులకాంకితుడయ్యేడు. "ఆలస్యం అమృతం విషం" అని వెంటనే చిన్న లేఖ ద్వారా కలుసుకోమని తెలియజేసేడు.

అవకాశం. అదృష్టం కలిసి వచ్చేయి ప్రకాష్‌కి 'రేపు ఉదయం పదకొండు గంటలకి, మా యింటిలోనే కలుసుకుందాం. తగిన ఏర్పాట్లు చేస్తాను' అని శ్యామల దగ్గర నుంచి లేఖ తన దగ్గరికి వచ్చిపడింది. ప్రకాష్ ఆనందానికి అంతులేకపోయింది !

మర్నాడు ఉదయం పది గంటల నుంచి, అవకాశం కోసం వీధి అరుగు మీద నిల్చుని సిగరెట్ కాలుస్తూ వున్నాడు. శ్యామల భర్త. పనిమనుష్యులు, ఎవరిమటుకు వాళ్లు వెళ్ళిపోవడం గమనిస్తున్నాడు....శ్యామల బయటికి వచ్చి, ఇరుగు పొరుగు ఇళ్ళవేపు చూచింది అమ్మలక్కలున్నారేమో అని; ఎవరూ లేరు. వెంటనే, ప్రకాష్‌ని రమ్మని చెయ్యిసైగతో పిల్చింది. ప్రకాష్ ఉత్సాహంతో ముందుకు వెళ్ళేడు....శ్యామల మందిరం కిలకిల నవ్వులతో, ఆనందంతో నిండిపోయింది ! ...

* * *

శ్యామల, ప్రకాష్‌లు అవకాశం వున్నప్పుడల్లా కలుసుకునేవారు. ప్రకాష్ చెడుతిరుగుళ్లు, శ్యామల పరిచయంతో పూర్తిగా పోయాయి. రొఖ్ఖంగా డబ్బు కావలసినప్పుడల్లా ఇస్తుండేది, అందుచేత తనకి ఏ విధమయిన లోటు వుండేది కాదు.

ఒకనాడు శ్యామల, ''ప్రకాష్ ! మనం ఈ వూరు నుంచి - ఎక్కడికయినా పారిపోదాం. ఏమంటావ్ ?'' అంది ప్రకాష్ ముఖంలోకి చూస్తూ.

ప్రకాష్‌ముఖం వెలవెలా పోయింది. మిన్ను విరిగి మీదపడ్డట్టయింది. ఈ మాట శ్యామల నోటంట వింటానని. తను కలలోనైనా తలచలేదు. ఏమి సమాధానం చెప్పడానికి తోచలేదు ఒక్కక్షణం...

''శ్యామా ! నీ వన్నట్టు చేయడం వీలయేదికాదు' నీవు పెళ్ళికాని పిల్లవికాదు; పెద్ద ఆస్థిపరుడి భార్యవు' మనం పారిపోతే ఎన్నో ప్రమాదాలు వాటిల్లుతాయి. ఆ ప్రయత్నం విరమించుకోడం మనకి మంచిది. ఇంతకీ అంత అవసరమేమొచ్చింది.'' అన్నాడు శ్యామల బుగ్గలను నిమురుతూ.

''మా వారికి నామీద అనుమానం బాగా కలిగింది' నన్ను నానాచీవాట్లు పెడుతున్నారు; నిన్న తిడుతూ - కొట్టేరుకూడా. ఇన్ని అగచాట్లు పడేకన్నా - ఎక్కడకన్నా పోతే సుఖంగా జీవించవచ్చు మనం ! డబ్బు గురించి ఇబ్బందేమీలేదు. నా మాటకాదనకు: నిన్నే నమ్ముకున్నాను'' అంది గాద్గదిక స్వరంతో.

ప్రకాష్ చెప్పలేక, చెప్పలేక ''అలా వీల్లేదు శ్యామా'' అనగలిగేడు. శ్యామల మనసు కల్లోలమయిపోయింది. ఆమె ప్లాన్ అంతా భగ్నమయింది. ఇద్దరూ మౌనంగా అలాకొన్ని నిమిషాను వుండిపోయారు.

వీధితలుపు దబదబమని శబ్దం వినేసరికి ఇద్దరి ప్రాణాలు పైకెగిరి పోయాయన్నంత పనయింది. "తలుపు తీస్తావా, లేదా" బైటనుంచి వచ్చినఆమాటలు తనభర్తవీ అని తెలుసుకుంది. గత్యంతరం రేక ప్రకాష్‌ని పెరటి త్రోవంట వంపించి. వీధి తలుపు తీసింది. బోనులో నుంచి వచ్చిన సింహంలాగ హుంకరిస్తూ. ''తలుపేసుకుని ఇంట్లో ఏం చేస్తున్నావ్ ! ఎవడితో సరస సల్లాపాలు జరుపుతున్నావ్ ? అంటూ గదిలో కొచ్చేడు. శ్యామల నోరెత్తకుండా గదిలోకి ప్రవేశించింది.

మహేశం ఇల్లంతా కలియజూసేడు. ఎవ్వరూ కనిపించలేదు. గదిలో మంచంకిందనుంచి చిన్న పొగరావడం కనిపించింది. వంగి దగ్గరగా చూచేడు. అప్పుడే కాల్చి పారేసిన సిగిరెట్టునీక అది. శ్యామల జడపట్టుకొని, ''లంజా ! చెప్పు; నేనువెళిపోయాక నీవు చేస్తున్న పని ఇదా! పైగా ధబాయిస్తావ్ మహా పతివ్రతలాగ. ఎవడూ రాకుండా ఇప్పుడీ సిగిరెట్‌పీక ఇక్కడికెలా వచ్చిందే రంకులంజా !'' అంటూ దబదబా శ్యామల వీపు మీద గట్టి బాదేడు, ఆ దెబ్బలకి ఆమె శరీరం హూనమయిపోయింది. కన్నీరుతో బాధగా మూలకి నక్కి కూర్చుంది,

ఆ రాత్రి శ్యామల నిద్రాదేవతికి దూరమై పోయింది, ''ప్రకాష్ నా మాట వింటాడనుకున్నామ....నాకు లేని భయం, ఇతనికెందుకో ! చచ్చువెధవ! ఆడదాని ఆవేదనని అర్థంచేసుకోలేక పోయాక ఎందుకు? నమ్మి నాశనం అయ్యాను. ఆయనగారు నోటికివచ్చిట్లు తిడుతూ, చేతికొచ్చి

నట్లు కొడుతున్నారు. కన్నవారింటికి పోయినా ఫలితం శూన్యం! ఇక కర్తవ్యం ??? ... ఆత్మహత్య ఒకటే. అంతకంటే మరోగత్యంతరంలేదు. అలా చేస్తాను...'' అని మనసులో అనుకొని, ముఖాన్ని ఆలుముకున్న కన్నీరుని చీరకొంగుతో తుడుచుకుంటూ – గోడగడియారం వేపు చూచింది. టైమ్ 2 గంటలు దాటింది. మహేశం గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. ఇంక ఆలశ్యం చేయకూడదని బయలుదేరింది ఇంట్లోనుంచి...

* * *

ఆపెద్ద చెఱువులో దభీమని శబ్దం వినిపించేసరికి ఆత్రుతతో, లేని ఓపిక, శక్తిని తెచ్చుకున్నట్లు చెఱువు దగ్గరకి పరుగున వెళ్ళేడు సాధూ మహరాజ్. నీటిలో గిలగిల కొట్టుకొంటున్న స్త్రీ మూర్తిని తీసి, తన భుజం మీద వేసుకొని, ఒడ్డునున్న తనకుటీరంలో పడుకో బెట్టేడు...ఏవో ఆకుపసర్లు ముక్కు రంధ్రాలలో పోసేడు. ఇంకేదో ఆకు ముఖమూ, వళ్ళూ అంతా రుద్దేడు. కొద్ది సేపటికి ఆమెకు తెలివి వచ్చింది. ఎదురుగావున్న సాధూ మహరాజ్‌ని ఆశ్చర్యంగా చూచింది. ఏదో మాట్లాడుదామని పెదిమలు కదుపుతున్న ఆమెను, ఇప్పుడేమీ మాట్లాడవద్దని ఆదేశించేడు. మాట్లాడకుండా చుట్టూచూసింది కనిపించినంతవరకు. పరిస్థితికి ఒక్కసారి కన్నీరు కారింది ఆమెకు. ఎండుటాకులు పోగుచేసి తెచ్చి చిన్న మంటవేసేడు....కొంతసేపటికి శ్యామల లేచి కూర్చుంది. "నన్నెందుకు రక్షించేరు ? జీవితంపై విరక్తితో ఆశలన్నీ విడచిపెట్టి ఆత్మహత్య చేసుకుందామని అనుకున్న దాన్ని ఎందుకు బ్రతికించి, మళ్ళీ ఈ నరకకూపంలో పడేసేరు మహాత్మా ?'' అని వలవల ఏడ్చింది.

"అమ్మా ! కళ్ళారా ఒక నిండు ప్రాణి ఆత్మహత్యకి గురి అవుతుంటే, చూస్తూ ఎలా ఊరుకోగలను ! ఇంత చిన్న వయస్సులోనే నీకు జీవితం అంటే ఇంతవిరక్తి ఎందుకు కలిగిందమ్మా!'' అనునయంగా అన్నాడుసాధూ.

ఆమాటకి శ్యామల ఏమీ జవాబు చెప్పలేదు. మౌనంగా తలదించుకొని వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది.

"ఏడవకమ్మా ! గాయపడిన నీ హృదయానికి, నా ప్రశ్నతో మళ్ళీ రేపి నిన్ను బాధపెట్టినందుకు క్షమించు'' అని, ఆమె కన్నీరుని తుడిచేడు.

"అబ్బే ! మీరన్నదానికి నేను బాధ పడలేదు, ఇక బ్రతికి ఏ విధంగా గడపడమా, ఎక్కడ తలదాచుకోడమా అని.''

"ఇంత విశాల ప్రపంచంలో నీ ఒక్కర్తికే చోటు లేదా ?''...కొంచెంసేపాగి, "నీకే అభ్యంతరం లేకపోతే నాకుటీరంలోనే రామ, కృష్ణ అంటూ కాలంగడప వచ్చు.''

"అలాగే మహాత్మ ! కాని ఈ ప్రదేశం విడచి దూరంగా అయితే నా మనస్సుకి శాంతి లభిస్తుంది స్వామీ! ఈ, నా కోరిక మన్నించమని నా ప్రార్థన''

"అలాగే నమ్మా ! ముందు ఆ తడిబట్టలు విప్పేసి, ఈ కాషాయవస్త్రాలు ధరించు ! తెల్లవారేక బయలుదేరుదాము'' అని అక్కడ సామాన్లు అన్నీ సర్దుకున్నాడు.

* * *

శ్యామల ఎక్కడా కన్పించకపోయేసరికి మహేశం మనసు కల్లోలమయిపోయింది. తన రహస్య ప్రియుడుతో ఎక్కడికో ఉడాయించి వుంటుందని అనుకున్నాడు. "నా పరువు, ప్రతిష్టలు మంటగలిపింది శ్యామల ! ఊళ్ళో వాళ్లకి ఏమని చెప్పడం, కన్నవారడిగితే ఏమి చెప్పడం ? ....నిజం చెప్తే నాకే అవమానంగా వుంటుంది. ఓరి భగవంతుడా ! ఎలాటి చిక్కు కలిగించేవయ్యా !'' అంటూ దిగులుగా కూలబడ్డాడు....ఆ విచారంతో మంచం పట్టేడు ....

ప్రకాష్, శ్యామల గురించి చాలా విచారించేడు; చేతులుకాలేక ఆకులు పట్టుకున్నట్టుగా "అ రాత్రి నేను శుద్ధ తెలివితక్కువ వెధవగా ప్రవర్తించేను. సాహసించి వెళ్ళిపోదామంటే వెనుకంజవేసేను, నా నుంచే శ్యాము ఎక్కడికో పరారయి పోయింది, లేకపోతే ఏ అఘాయిత్యం చేసుకుందో ! .... వెధవ కుటుంబ బాధ్యతలు నా నెత్తినెక్కాయి. ఇంట్లో తెచ్చేవాళ్లే వుంటే, హాయిగా శ్యామలతో పోవడానికి సాహసించేవాణ్ణేమో ! ఇప్పుడు ఏమనుకుని ఏడిస్తే ఏంలాభం ? చేయిదాటి పోయాక'' అని మనసు అనుకొని దీర్ఘంగా నిట్టూర్పు విడిచేడు.

...కొన్ని సంవత్సరాలు కాలగర్భంలో గిర్రున తిరిగి పోయాయి. శ్యామల ఇప్పుడు ''శారదమ్మ'' పేరుతో ఆధ్యాత్మిక ప్రబోధనలు ఊరూర చేయ నారంభించింది. ప్రజలంతా ఆమెను అత్యంత గౌరవ, మర్యాదలతో ఆదరించేవారు. తన గత జీవితాన్నంతా మరిచి, ఆద్యాత్మిక చింతనతో ఆనందంగా కాలం వెళ్ళబుచ్చుతుంది ...

భజన పూర్తికావచ్చింది, తర్వాత 'మానవ ధర్మం' గురించి శారదమ్మగారు ఉపన్యసించబోతున్నారు. విద్యుద్దీపాల కాంతి శారదమ్మగారి ముఖవర్చస్సుమీద తేజోవంతంగా అగుపిస్తున్నది. ప్రకాశం గతస్మృతుల నుంచి వర్తమానంలోకి వచ్చేడు. శారదమ్మని ఇంకా అలా చూస్తూనే వున్నాడు .... హావులింతలు అదేపనిగా రావడం, కనురెప్పలు బరువుగా మూసుకుపోవడంతో, ఇంటికిపోయి నిద్రపోదామని బయలుదేరేడు ....

మర్నాడు సాయంత్రం ప్రకాశం కొత్త గ్లాస్కో పంచ, పెద్దాపురం పట్టు లాల్చీ, పైమీద కండువా వేసుకొని బయలుదేరుతుండగా 'నాన్నరూ! నాకు బిళ్ళలు తెండి' అని, తన 5వ కొడుకు చంటాడు అన్నాడు. 'అలాగే లే' అని తిన్నగా రామభజన కోవెలకి బయలుదేరేడు.

అక్కడ ఎవ్వరూలేకపోవడంతో, నిరాశ, నిస్పృహలతో అలా నిల్చుండి పోయాడు. అక్కడ కోవెల తుడిచే పనిమనిషి, ప్రకాశాన్ని చూచి 'బాబూ! మీ పేరు ప్రకాశ్ బాబేనా' అంది. అవునన్నట్లు తలూపేడు. 'ఈ చీటీ మీకు శారదమ్మగారు ఇయ్యమన్నారండి' అని మొలకొంగున దోపిన చీటీని తీసి ప్రకాశానికి అందించింది; మడత విప్పి మనసులో ఇలా చదువుకున్నాడు:-

ప్రకాశరావుగార్కి,

నిన్నటిదినం మిమ్మల్ని - నేను, నన్ను - మీరు గుర్తించగలిగేము. ఈ జీవితంలో మళ్ళీ మనం ఒకరి నొకరం చూచుకుంటామని కలలోనయినా అనుకోలేదు. అకస్మాత్తుగా చూచుకోవడం జరిగింది. మీ పునః ధర్శనం నా హృదయంలో తుఫాన్ చెలరేగినట్లయింది. మనస్సు స్వాధీనం తప్పిపోతున్నట్లుగా అయింది. భజన చేస్తున్నా|-ధ్యానం మరోవేపుకి మళ్ళింది .... ఆ రోజులలో మనం గడిపిన సంతోషసమయాలు నా కళ్ళముందు అలా నిలచి పోయాయి! అందుచేత ఈ ఊరులో ఇంక వుండకూడదనిపించింది. ఆంధ్ర ప్రజలంతా నన్ను దివినుండి భువికి వచ్చిన దేవతగా చూస్తూ, 'భక్తిప్రపూర్ణిత' గా ఆరాధించే వారికి, నా గత చరిత్ర తెలిస్తే నన్ను చాలా హేయంగా చూస్తారు; నాకు నిలువనీడ వుండని పరిస్థితులు ఏర్పడతాయి. ఈ వూరులోవుంటే ఎలాగా ప్రమాదం తప్పదని తెలుసుకొని, ఇవాళ బయలుదేరి వెళ్ళిపోయాను. ఎక్కడికి వెళ్లేనని, నాగురించి మీ రేమి ప్రయత్నాలు చెయ్యవద్దని నా ప్రార్థన: గతాన్ని, నన్ను మరిచిపోడానికి ప్రయత్నించండి - సెలవ్, నమస్తే''

ఇట్లు

శారదమ్మ. (శ్యామల)

ఆ లేఖ మడతపెట్టి పట్టుకొని ఇంటితోవకి మర్లేడు. "శ్యామల - శారదమ్మగా మారుటకు కారణం? భర్తని, బోలెడు ఆస్తిని వదలుకొనిపోవడానికి నేనేనా కారకుణ్ణి?? .... పోనీ పారిపోతే పోయింది. ఈ సన్యాసి వేషంలో మునిగి వేదాంతప్రచారాల్లో దిగవలసిన అవసరమేమొచ్చింది'' మొదలగు అనేక ప్రశ్నలు ముఖాముఖిగా అడిగి తెలుసుకుందామని మనసులో ఆశగా అనుకున్న ప్రకాశానికి చెప్పరానంత దిగులు కలిగింది, ధీర్ఘంగా నిట్టూరిస్తూ చేత నున్న లేఖని కోపంగా ముక్కలు ముక్కలుగా చింపేసి పారేసాడు. ....

